క్లుప్తంగా

రైతుల ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ



నగదు జమ ప్రక్రియను పరిశీలిస్తున్న సీనియర్ ఆడిటర్ రవికుమార్

చిలుకూరు : నిబంధనల ప్రకారం రైతుల ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ చేస్తున్నామని హుజూర్‌నగర్ డివిజన్ సీనియర్ ఆడిటర్ రవికుమార్ అన్నారు. మంగళవారం చిలుకూరు మండలంలోని నారాయణపురం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో రైతుల రుణమాఫీ నగదు జమ వివరాల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంఘం పరిధిలో మొదటి విడతలో 599 మంది రైతులకు 2 కోట్ల 5 లక్షల 29 వేల 562 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఇంకా 600 మంది రైతులకు రెండో విడతలో రుణమాఫీ జాబితా రానున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో రుణమాఫీ అయిన రైతులకు వెంటనే డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సీఈఓ సాకి వెంకటేశ్వర్లు, సిబ్బంది పూర్ణయ్య, అఖిల్, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హేమామాలిని కోరారు. మంగళవారం నడిగూడెం మండలంలోని కాగితరామచంద్రాపురంలో స్వయం కృషి, ది రైట్ వే ఆఫ్ గ్లోబల్ ఆర్గనైజేషన్, కామినేని ఆసుపత్రిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 62 మందిని శస్త్ర చికిత్సలకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గడ్డం సాంబశివ రావు, ఎస్‌కె.జహీర్, చక్రాల పిచ్చయ్య, గుద్దేటి శ్యామ్యూల్, జిల్లేపలి జాషువా, దేవరంగుల వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యువత సైబర్ మోసాల బారిన పడొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ నీలిమా

మోతె : యువత సైబర్ మోసాల బారిన పడొద్దని సూర్యాపేట షీటీం ఎస్‌ఐ నీలిమా అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మోతె మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలను ఇతరులకు తెలపవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు, యువతుల వేధింపులపై 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, షీటీం ఏఎస్సై సాలయ్య, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, భరోసా సెంటర్ సభ్యులు మౌనిక, కిరణ్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



గణపవరంలో సీఎం, మంత్రి, ఎమ్మెల్యేల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇర్ల సీతారాంరెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ సందర్భంగా మంగళవారం కోదాడ మండలంలోని గణపవరంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు జాబిశెట్టి నాగప్రసాద్, కాసాని సత్యం, ఇర్ల నారపరెడ్డి, ఇర్ల లక్ష్మారెడ్డి, బండి సత్యం, పిడమర్తి బుచ్చాలు, కాసాని శ్రీను, రైతులు ఉన్నారు.

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు



ఎస్‌ఐ నవీన్‌కుమార్

అనంతగిరి : సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం అనంతగిరి పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాను పోలీసు శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని అన్నారు.

జీతాలందక.. జీవనం సాగక

- పంచాయతీ కార్మికులకు నెలనెలా అందని వేతనాలు
- కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



చిలుకూరులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

చిలుకూరు : ప్రతిరోజూ పొద్దుపొడవక ముందే విధుల్లోకి వచ్చి గ్రామాన్ని పరిశుభ్రం చేసే గ్రామ పంచాయతీ కార్మికులకు నెలనెలా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో వేతనాలు రాక కుటుంబ పోషణ భారమవుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మల్టీపర్పస్ వర్కర్లుగా అన్ని రకాల పనులు చేస్తున్నప్పటికీ జీతాలు మాత్రం సమయానికి ఇవ్వడం లేదని అంటున్నారు. అయితే గ్రామ పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చే డబ్బులను కార్మికులకు జీతాలుగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ జీతాలు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని జీపీ కార్మికులు ఆరోపిస్తున్నారు.

ఏడాదిగా వేతనాలు పెండింగ్..

చిలుకూరు మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 100 మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు. కాగా, మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో 13 మంది మల్టీ పర్పస్ సిబ్బంది ఉన్నారు. వీరికి రెండు నెలల నుంచి జీతాలు అందడం లేదు. బేతవోలు జీపీలో 20 మంది మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా వీరికి 10 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఆచార్యులగూడెం జీపీలో నలుగురు, చెన్నారిగూడెం జీపీలో ఐదుగురు మల్టీపర్పస్ సిబ్బంది ఉండగా వీరికి ఏడాదిగా జీతాలు అందడం లేదు. జెర్రిపోతులగూడెం జీపీలో ఆరుగురు మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా 7 నెలలుగా, పోలేనిగూడెం జీపీలో ఐదుగురు మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా వీరికి 13 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. మాధవగూడెం జీపీలో ఇద్దరు మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా వీరికి 10 నెలల నుంచి, కొమ్ముబండతండాలో మల్టీ పర్పస్ సిబ్బంది ఇద్దరు ఉండగా వీరికి 6 నెలల నుంచి, ఆర్లెగూడెంలో ముగ్గురు మల్టీ పర్పస్ సిబ్బంది ఉండగా వీరికి 7 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. రామ్‌చంద్రానగర్‌లో ముగ్గురు సిబ్బంది ఉండగా 10 నెలల నుంచి, రామాపురంలో ఏడుగురు ఉండగా 4 నెలల నుంచి, సీతారాంపురంలో నలుగురు ఉండగా వీరికి 10 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నారాయణపురంలో ఉన్న ఏడుగురు సిబ్బందికి మూడు నెలలుగా రావడం లేదు. సీత్లాతండాలో ఉన్న ఐదుగురికి, దూదియాతండాలో ఉన్న ఐదుగురికి ఏడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. జానకీనగర్‌లో ఉన్న ముగ్గురికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. కొండాపురంలో ఉన్న ఆరుగురు మల్టీ పర్పస్ సిబ్బందికి 2 నెలల నుంచి జీతాలు అందడం లేదు.

పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



మాకు నెలనెలా జీతాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. 51 జీఓను రద్దు చేసి పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. 60 జీఓ ప్రకారం జీతాలు చెల్లించాలి.

– వడ్రాణపు తిరపయ్య, జీపీ కార్మికుడు, బేతవోలు

తెలంగాణపై బీజేపీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు.మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో ఇచ్చిన 35 అంశాల హామీలను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించిందని తెలిపారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ, గిరిజన యూనివర్శిటీ, హైదరాబాద్ నగరంలో విద్య, పారిశ్రామిక, సాంకేతిక సౌకర్యాలు లాంటి అంశాలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం విచారకరమని అన్నారు. తెలంగాణలో ఇతర రాష్ట్రాలను కలుపుతూ పారిశ్రామిక కారిడారు ఏర్పాటు విషయం బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు కేంద్ర బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

నేరేడుచర్ల : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలకు కేటాయించిన బడ్జెట్‌లో వివక్ష చూపిందన్నారు. ఏపీలోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, తెలంగాణలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక బడ్జెట్ ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా నిధులను పూర్తిగా తగ్గించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉంటే కనీసం 8 రూపాయలు కూడా కేటాయించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నితీష్‌కుమార్, చంద్రబాబునాయుడిపై ఆధారపడి ఉండటంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందని విమర్శించారు.

కంకర మిల్లును సీజ్ చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోతె : మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కంకర మిల్లును సీజ్ చేయాలని మోతె మండల కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమయంలో అక్కడకు వచ్చిన కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ డివిజన్ నాయకులు పిడమర్తి లింగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేపడుతుండడంతో మిల్లు పక్కన ఉన్న పంట పొలాల్లోకి కంకర రాళ్లు ఎగిరి పడి పంటలు నాశనమవుతున్నాయని అన్నారు. ఈ విషయంపై పలువురు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా విచారణకు వచ్చిన అధికారులు రైతుల ఇబ్బందులు పట్టించుకోకుండా క్రషర్ మిల్లు యాజమాన్యానికి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మరబోయిన గణేష్, యల్లయ్య, అల్దాసు వెంకన్న, వడకాల మహేష్, దోనేటి మల్సూర్, మండవ మహేష్, ఏసు, నిమ్మరబోయిన గోపి, తదితరులు పాల్గొన్నారు.

బాల మేధావులకు సన్మానం



బాల మేధావులను సన్మానిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణానికి చెందిన ఇరువురు బాల మేధావులను వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. 28 నెలలకే 15 నిమిషాల్లో 150 ప్రశ్నలకు సమాధానం చెప్పి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన, రిటైర్డ్ టీచర్ గుండా రామ్మూర్తి మనుమరాలు శ్రీరంగం ఉపాసన, ప్రముఖ వ్యాపార వేత్త ఓరుగంటి పవన్‌కుమార్-రేణుకల దంపతుల కుమారుడు రెయాన్స్‌లను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, ఇంటర్నేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గరిణే అరుణకుమారి, క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీప్రసన్న, జోన్ ఛైర్మన్లు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, కందిబండ వాసంతి, రాచకొండ శ్రీనివాస్, కందిబండ శ్రీనివాస్, సైదయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మధు, గోపాలకృష్ణ, కోటేశ్వర్ రావు, ప్రభాకర్, పరమేశం, సత్యనారాయణ, ప్రవీణ్, సంతోష్, రూపా రేణుక, రామ్మూర్తి, కనక లక్ష్మి, సంతోష్, స్వప్న, అనూష, శివ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

- వేమూరి సత్యనారాయణ

మునగాల : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిందని మండలానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు దోహదపడిన తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం, బడ్జెట్ సమావేశ ప్రసంగంలో కనీసం తెలంగాణ ఊసెత్తకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రిగా, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేంద్ర సహాయమంత్రిగా ఉండి కూడా ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడం తెలంగాణ పట్ల వివక్ష చూపడమేనన్నారు. రైలు మార్గాలు లేని జిల్లాలకు కొత్త ట్రాక్‌లు వస్తాయన్న ఆశలు మరోకసారి అడియాశలయ్యాయన్నారు. కనీసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, పట్టణాలు, నగరాల రహదారులకు నిధులు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. విభజన హామీలలో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల ప్రస్తావన లేకపోవడం, విద్య, వైద్యం, ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం తెలంగాణ పట్ల వివక్ష చూపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

హుజూర్‌నగర్ : ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం హుజూర్‌నగర్ తహసీల్దార్ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు ఆసరా పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు, కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని, దానికి ముదిరాజ్‌ను మాత్రమే చైర్మన్‌గా నియమించాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు ఆదుల యాదగిరి, ఇంటి అచ్చమ్మ, సత్యనారాయణ, నర్సింహారావు, ఠాగూర్, రవి, నాగరాజు, మంగమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేయాలి



పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు క్రైస్తవుల సంక్షేమం కోసం కృషి చేయాలని పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఎల్షదాయి చర్చిలో పాస్టర్స్ ఫెలోషిప్ పట్టణ, మండల నూతన కమిటీలను ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జె.సుదర్శన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడిగా పి.పాల్‌చారి, ప్రధాన కార్యదర్శిగా జె.దానియేలు, కోశాధికారిగా జి.ఆమోస్, ఉపాధ్యక్షుడిగా పి.వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.సురేష్, గౌరవ అధ్యక్షుడిగా ఆర్.జోసెఫ్‌రాజు, కోదాడ మండల అధ్యక్షుడిగా షేక్. కోర్నేలి బాబు, ప్రధాన కార్యదర్శిగా జి.దానియేలు, కోశాధికారిగా యు.యేసేపు, ఉపాధ్యక్షుడిగా కె.ఏసుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సైమన్, గౌరవ అధ్యక్షుడిగా సమాధానంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కోటిరెడ్డి, కాంపాటి శ్రీను, జోసెఫ్, శ్రావణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

విద్యా రంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలి

మోతె : తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విప్లవ రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న 8214.54 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఏభై వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పీఆర్టీయూ సభ్యత్వాలు నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసాని నాగేశ్వర రావు, మేకల మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు బొల్లికొండ కోటయ్య, రాష్ట్ర అసోసియేట్ మాజీ అధ్యక్షుడు ఓరుగంటి రవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కట్కూరి మధుసూదన్‌రెడ్డి, కొల్లు వెంకటేశ్వరరావు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పప్పుల వీరబాబు, జిల్లా అసోసియట్ అధ్యక్షుడు తీగల నరేష్, గెజిటెట్ ప్రధానోపాధ్యాయుడు పిడతల వెంకటేశ్వర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి, కేజీబీవీ స్పెషల్ అధికారి సునీతరాణి పాల్గొన్నారు.

అర్హులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి



కోదాడరూరల్ : కాపుగల్లులో రైతుబీమా దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ పాలెం రజిని

కోదాడరూరల్ : జూన్ 28లోపు నూతనంగా పట్టదారు పాస్‌పుస్తకాలు పొంది 18 నుంచి 59 ఏళ్ల లోపు వయసు ఉన్న రైతులు ఆగస్టు 5వ తేదీ వరకు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పాలెం రజిని అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాపుగల్లు రైతు వేదికలో పలువురు రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అర్హులైన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పాటు దరఖాస్తు ఫారం నింపి అందజేయాలని అన్నారు. నామిని పేరు మార్పులు, ఆధార్‌లో తప్పులు ఉన్న రైతులు సరిచేసుకునేందుకు ఈ నెల 30వరకు గడువు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మహేష్, రైతులు ఉన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

చిలుకూరు : కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు వచ్చే నెల 5వ తేదీ లోపు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో రైతు బీమా కలిగి ఉన్న రైతులు రైతు బీమాలో ఏమైనా తప్పులు ఉన్నా, నామిని పేరు మార్చుకోవాలనుకున్న ఈ నెల 29వ తేదీ వరకు సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌తో వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఈఓలు చంద్రశేఖర్, శిరీష, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

428 జీఓ అమలు చేయాలని వీహెచ్‌కు వినతి



వీహెచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోపీనాథ్

నడిగూడెం : వ్యవసాయ శాఖలో విస్తరణాధికారుల పోస్టుల భర్తీలో 428 జీఓను అమలు చేయాలని క్రాప్ ప్రొడక్షన్ కోర్సు విద్యార్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసాని గోపీనాథ్ మంగళవారం నడిగూడెంకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ జీఓ ప్రకారం విస్తరణాధికారుల పోస్టుల భర్తీలో ఇంటర్మీడియట్‌లో వృత్తి విద్య కోర్సు క్రాప్ ప్రొడక్షన్ చదివిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇచ్చేవారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులం ఉన్నామని, 428 జీఓ ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

హుజూర్‌నగర్ : ఆషాడ మాసం సందర్భంగా పట్టణంలో ఎల్లమ్మతల్లి బోనాల పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఫైర్ స్టేషన్ వద్ద గల ఎల్లమ్మ ఆలయానికి బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల వీరయ్య, వర్దనమ్మ, గురుప్రసాద్, లక్ష్మణ్, జగ్గుల నరేష్, వెంకన్న, వీరబాబు, నాగమ్మ, పంతులమ్మ, మహిళలు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవింద రెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా భరత్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన దాయం భరత్‌రెడ్డిని నియమిస్తూ ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వర్షిత్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డిఅఉ అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతంకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియమకానికి సహకరించిన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ల

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



చిలుకూరు : అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు



కోదాడరూరల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయ స్వామి గుడిలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఓరుగంటి స్వర్ణలత జ్ఞాపకార్థం భర్త కృష్ణమూర్తి, అమెరికాలో ఉన్న హరిణి జన్మదినం సందర్భంగా తల్లిదండ్రులు శేషు, శారద దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు, దాతలు, భక్తులు ఉన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం చిలుకూరు, రామాపురం, కోదాడకు చెందిన దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజారి రజనీకాంత్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన దాతను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచు లక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతను పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా శ్రీఆంజనేయస్వామికి తమల పాకులతో ప్రత్యేకార్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

మఠంపల్లి : రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మఠంపల్లి సమీపంలోని మోడల్ స్కూల్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. మఠంపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై కొత్తతండావైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న కొత్తతండాకు చెందిన మరో బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కొత్త తండాకు చెందిన మాలోతు బుజ్జి తలకు తీవ్రగాయాలు కాగా, సపావట్ సేవ్యాకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇరువురిని వాహనంలో హుజూర్‌నగర్‌లోని వైద్యశాలకు తరలించారు. కాగా, బైక్‌ను ఢీకొట్టిన వ్యక్తులు పరారయ్యారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన మఠంపల్లి పోలీసులు ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

మహిళలకు చీరలు పంపిణీ

మిర్యాలగూడ : తీజ్ పండుగ సందర్భంగా మంగళవారం దామరచర్ల మండలంలోని కేజేఆర్ కాలనీలో సిద్ధూ యువసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.